ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024


సింగూరు కాల్వ (ఫైల్)

మంజీరా..
ఇక బిరబిరా..

- రూ.300 కోట్లతో అంచనాల రూపకల్పన
- అందోలు నియోజకవర్గంలో చివరి ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు
- మంత్రి దామోదర్ చొరవతో నీటిపారుదలశాఖ కార్యాచరణ

సింగూరు కాల్వల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 16: అందోలు నియోజకవర్గంలో చివరి ఆయకట్టుకు సింగూరు జలాలను అందించడమే లక్ష్యంగా కాల్వల ఆధునికీకరణకు నీటిపారుదల శాఖ చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. సింగూరు ప్రాజెక్టు వరద కాల్వతో పాటు కుడి, ఎడమ కాల్వల పరిధిలో మొత్తం 60 కిలోమీటర్ల మేర ఆధునికీకరణకు రూ.300 కోట్లు అవసరమవుతాయని అంచనాలను రూపొందించి, ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించింది.

లైనింగ్ లేక ఇరవై శాతం నీరు వృథా

సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న సుమారు 40 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు పంట కాలంలో నీటిని విడుదల చేస్తారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలు పూర్తికాకపోవడంతో అధికారులు ప్రధాన కాల్వల ద్వారానే చెరువులు, కుంటల్లోకి నీటిని మళ్లించి, పంటలకు అందిస్తున్నారు. అయితే, ఈ కాల్వలను పదిహేనేళ్ల కిందట నిర్మించగా, వాటికి సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో కాల్వ గట్టులపై ముళ్లపొదలు పెరిగి, చెత్తచెదారంతో నిండిపోయాయి. దాంతో సాగు కోసం ప్రధాన కాల్వలకు విడుదల చేస్తున్న నీటిలో ఇరవై శాతం మేర వృథా అవుతున్నది. చివరి ఆయకట్టు భూములకు నీరు అందడం లేదు. ఈ పరిస్థితులను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ కాల్వల ఆధునికీకరణ కోసం చర్యలు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ రూ.300 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే సింగూరు ప్రాజెక్టు కుడి కాల్వ 24 కిలోమీటర్లు, ఎడమకాల్వ 12 కిలోమీటర్లు, వరదకాల్వ 24 కిలోమీటర్ల మేర ఆధునీకరించనున్నారు.


సింగూరు ప్రాజెక్టు

యాసంగి..
లక్ష ఎకరాలు కోత

మెదక్ జిల్లాలో 1,85,708 ఎకరాల్లో పంటలు

భారీగా తగ్గిన విస్తీర్ణం ● గతేడాది యాసంగిలో 2,71,058 ఎకరాల్లో సాగు

లెక్క తేల్చిన వ్యవసాయశాఖ సర్వే

మెదక్, ఫిబ్రవరి 16: యాసంగి సీజన్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గింది. మెదక్ జిల్లాలో గత సంవత్సరం యాసంగితో పోలిస్తే దాదాపు లక్ష ఎకరాలు తగ్గింది. వ్యవసాయశాఖ సాగు సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ప్రతీ సంవత్సరం ప్రభుత్వం పంటల లెక్క తేల్చేందుకు క్రాప్ బుకింగ్ పేరిట వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించే క్షేత్ర స్థాయి సర్వే ఈ నెల 15వ తేదీతో ముగిసింది. జిల్లాలో 3,97,480 ఎకరాల సాగు భూమి ఉండగా, 2,21,623 మంది రైతులు ఉన్నారు. గత సంవత్సరం 2022-23 యాసంగి సీజన్‌లో 2,71,058 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు వేయగా, 2023-24 సీజన్‌లో 1,85,708 ఎకరాల సాగుకు పరిమితమయ్యారు. వరి నాట్లు గతేడాది 2,60,341 ఎకరాల్లో వేయగా.. ఈసారి 1,75,924 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ నివేదికలో తేలింది. జొన్న గత సంవత్సరం 5,997 ఎకరాల్లో సాగు చేయగా.. ప్రస్తుతం 6,458 ఎకరాలకు పెరిగింది. మొక్కజొన్న మాత్రం గత సంవత్సరం కంటే తగ్గింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటలకు చీడలు సోకే అవకాశం అధికంగా ఉండడం, తేమ శాతం తగ్గిపోవడంతో యాసంగి సాగును తగ్గిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.


వార్తలు 8లో..

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు మద్దతుగా శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు, ప్రజాసంఘాలు ప్రదర్శన నిర్వహించారు.
-సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 16



ఇట్స్ సెల్ఫీ టైం..!

టీవీ యాంకర్ శ్రీముఖి శుక్రవారం చేగుంటలో సందడి చేసింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ మొబైల్‌ఫోన్ల షోరూంను ప్రారంభించేందుకు ఆమె విచ్చేయడంతో పెద్దసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అభిమానులతో సరదాగా ఆమె సెల్ఫీ దిగారు.

మార్కెట్ కమిటీలపై నేతల ఆశలు

కొత్త పాలకవర్గాల నియామకంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి కసరత్తు

మెదక్, ఫిబ్రవరి 16: నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్‌లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో 26 పాలక వర్గాలు రద్దయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, మెదక్ జిల్లాలోని తూప్రాన్ మార్కెట్లలో పాలకవర్గాలు లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన నడుస్తుండగా, మిగిలిన మార్కెట్ల పాలకవర్గాలు రద్దయ్యాయి. దీంతో పదవులపై కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలో చైర్మన్, వైస్‌చైర్మన్, 12 మంది నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు అధీకృత లైసెన్స్ ట్రేడర్లు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు కలిపి మొత్తం 18 మంది సభ్యులుంటారు. మార్కెట్‌లో ధరల నియంత్రణ, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి, ఎగుమతి వివరాలు, మార్కెట్ నిర్వహణ బాధ్యతలను వీరు పర్యవేక్షిస్తారు.

ఆశావహుల ప్రయత్నాలు

ఉమ్మడి జిల్లాలో మెదక్, అందోలు, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు వారి ఆధ్వర్యంలోనే జరుగనున్నది. మిగిలిన ఏడు నియోజకవర్గాల పరిధిలోని మార్కెట్లకు కమిటీల ఎంపికకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రతిపాదనలు అందజేసే అవకాశముంది. పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులు పదవులను ఆశిస్తున్నారు. సీనియర్ నేతలను కలిసి తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

మార్కెట్ కమిటీలు రద్దయ్యాయి

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. మెదక్ జిల్లాలోని 5 మార్కెట్ కమిటీలు, సిద్దిపేటలోని 11 మార్కెటింగ్ కమిటీలు, సంగారెడ్డిలోని 7కమిటీలు రద్దయ్యాయి. తూప్రాన్, జహీరాబాద్ కమిటీలు ఇప్పటికే ఖాళీగా ఉన్నాయి. కొత్త పాలకవర్గాలు త్వరలోనే ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి.
-మహ్మద్ రియాజ్, మెదక్, సంగారెడ్డి జిల్లాల మార్కెటింగ్ అధికారి

తోడేస్తున్నారు!

- యథేచ్ఛగా నీటి దందా
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వేసవి ముంగిట ప్రమాద ఘంటికలు

కంది, ఫిబ్రవరి 16 : సంగారెడ్డి జిల్లా కంది మండలంలో భూగర్భ జలాలను యథేచ్ఛగా తోడేస్తున్నారు. పంట పొలాల్లో పారాల్సిన నీటిని పరిశ్రమలకు తరలిస్తున్నారు. పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకొని నిత్యం వందల కొద్ది ట్యాంకర్ల నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కంది, కాశీపూర్, కలివేముల, జూల్‌కల్, ఇంద్రకరణ్, చేర్యాల, కవలంపేట, చిమ్నాపూర్, ఆరుట్ల, ఎర్దనూర్ తదితర గ్రామాల్లో నీటి వ్యాపారం జోరుగా సాగుతున్నది. వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఇంద్రకరణ్ గ్రామంలోనే రోజూ 50 ట్యాంకర్లు నీటిని తరలిస్తున్నారు. కొందరు దళారులు రైతులను మభ్యపెట్టి డబ్బు ఆశజూపి వ్యవసాయ బోర్ల నుంచి లక్షల లీటర్ల నీటిని తోడేస్తున్నారు. అధికారులు అడపాదడపా నీటి ట్యాంకర్లను పట్టుకుని జరిమానా విధిస్తున్నా.. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో ట్యాంకర్లు, వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తూ దళారులు దండుకుంటున్నారు.


ఓడీఎఫ్ రహదారి పక్కన ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం


ఇంద్రకరణ్ వద్ద నీటి తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

బ్యూటీ పార్లర్ పేరుతో ఘరానా మోసం

ఫ్రాంచైజీలంటూ రూ.3 కోట్లు వసూలు
ఉమ్మడి జిల్లాలో 100 మంది బాధితులు
నలుగురు నిర్వాహకులు అరెస్టు
పరారీలో ముగ్గురు ప్రధాన నిందితులు

7లో..

తల్లి ఒడికి చేరిన పసికందు

పుట్టగానే విసిరేసిన తల్లికి మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారుల కౌన్సెలింగ్

పుల్‌కల్, ఫిబ్రవరి 16: సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం ముదిమాణిక్యం గ్రామంలో రాళ్లకుప్పలో లభ్యమైన పసికందు ఎట్టకేలకు తల్లిఒడికి చేరింది. గ్రామానికి చెందిన ఓ ఒంటరి మహిళ ఈ నెల 14న తెల్లవారుజామున మగబిడ్డకు జన్మనిచ్చింది. అదేరోజు గ్రామ పొలిమేరల్లోని శ్మశానవాటిక వద్ద రాళ్లకుప్పలో విసిరేసింది. స్థానికుల సమాచారం మేరకు శిశువును స్వాధీనం చేసుకున్న ఆశా వర్కర్ పోలీసుల సాయంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసుల విచారణతో ఆ పసికందు తల్లిని గుర్తించారు. శిశువును పోషించడం ఇష్టంలేకనే రాళ్లకుప్పలో పడవేశానని ఆమె విచారణలో అంగీకరించారు. ఆమెను శుక్రవారం సంగారెడ్డిలోని ప్రధాన ఆసుపత్రికి పిలిపించిన జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి లలితాకుమారి, బాలల పరిరక్షణ అధికారి రత్నం కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో బిడ్డను తీసుకువెళ్లి పోషించుకుంటానని తల్లి అంగీకరించడంతో శిశువును అందజేశారు. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు క్షేమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ విషయంపై జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి లలితాకుమారి మాట్లాడుతూ పిల్లలను పోషించనిలేని పరిస్థితుల్లో ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్‌చేసి అప్పగించాలని కోరారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునేవారు జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అధికారికంగా దత్తత పొందవచ్చని తెలియజేశారు.



వలసల నివారణకు
'ఖేడ్'లో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- శాసనసభలో ప్రస్తావించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16: పరిశ్రమల వికేంద్రీకరణలో భాగంగా వెనుకబడిన ప్రాంతమైన నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ జీరో అవర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఖేడ్ ప్రాంతంలో ఉపాధి లేక ప్రజలు హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు చెరుకు సీజన్‌లో రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వలసలు వెళ్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయిన నల్లవాగు ప్రాజెక్టును అభివృద్ధిచేసి వరద నీటిని నిల్వ చేసుకుని వినియోగించుకోవడానికి నిధులు కేటాయించాలని, ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలని కోరారు. అలాగే, పీజీ కళాశాల, మహిళా పాలిటెక్నిక్, ఐటీఐ మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఏరియా వైద్యశాలలో పడకలు పెంచాలని, పీహెచ్‌సీల్లో ఖాళీలను భర్తీ చేసి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. తడ్కల్‌ను మండలంగా చేయాలని, మెదక్ జిల్లాలో ఉన్న పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డిలో కలపాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ఎమ్మెల్యే తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి'

జహీరాబాద్, ఫిబ్రవరి 16: ప్రమాదాల నివారణలో అందరం భాగస్థులం కావాలని మహీంద్రాలాజీస్టిక్, ఎల్అండ్‌టీ, మ్యాగ్నోవెల్‌ఫేర్, కర్మాగారాల అధికారులు చేతన్, విజయ్‌పవార్, రాజేష్‌లు పేర్కొన్నారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని మహీంద్రా అకాడమీ పాఠశాల్లో డ్రైవర్లకు, వారి కుటుంబసభ్యులకు రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు లేకపోతే వ్యవస్థలన్నీ మూసివేతకు గురవుతాయన్నారు. దేశ, విదేశాలకు వస్తువులు, తదితరాలను చేరవేయడంలో డ్రైవర్లది కీలకపాత్ర అన్నారు. అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని కట్టడి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా కర్మాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌సేఫ్టీ అధికారులు

కంది, ఫిబ్రవరి 16 : కంది మండలం కాశీపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సంగారెడ్డి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యావాపూర్‌లో మెగా వైద్య శిబిరం

తూప్రాన్, ఫిబ్రవరి 16: తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్, గర్భ సంచి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్పలత, ఎంపీటీసీ గంగుమల్ల సంతోష్‌రెడ్డి, ఎంజాల కుమార్, కుమ్మరి నర్సింలు, పాక వెంకటేశ్, మెడిసిటీ వైద్యులు డాక్టర్ విక్రమ్, గగణ, రాజేశ్వరీ, గౌతమి, పూజిత, సుధాకర్, నవీన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవోపేతంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

రామాయంపేట, ఫిబ్రవరి 16: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు వైభవోపేతంగా సాగాయి. గురు, శుక్ర వారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు అయ్యప్పను దర్శించుకున్నారు. భక్తుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

గిరిజన తండాల్లో సేవాలాల్ ఉత్సవాలు

రామాయంపేట, ఫిబ్రవరి 16: సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలు అట్టహాసంగా సాగాయి. మండల పరిధిలోని అన్ని తండాల్లోనూ మహిళలు, యువకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాయంపేట, దంతేపల్లి, కాట్రియాల, కోమట్‌పల్లి లో నిర్మితమైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ బస్సు యాత్రను విజయవంతం చేయాలి

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 : బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేది నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల్లో చేపట్టే బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కోరారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మెదక్, జహీరాబాద్, చేవెళ్ల, కరీంనగర్ పార్లమెంట్ క్లస్టర్‌లలో జరిగే బస్సు యాత్రపై శుక్రవారం ముందస్తు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ బస్సు యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బసాపురం లక్ష్మీ నరసయ్య, జహీరాబాద్ శాసనసభ ప్రభారీ శ్రీనివాస్ నాయుడు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి, మురళీధర్‌గౌడ్, దిలీప్‌నాయక్, అనంత్‌రావు, మాణిక్‌రావు, వెంకటనర్సింహ్మారెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, విష్ణువర్దన్‌రెడ్డి, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగూడెం గ్రామంలో మహిళ అదృశ్యం



బుచ్చమ్మ (ఫైల్)

గుమ్మడిదల, ఫిబ్రవరి 16 : ఓ మహిళ అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామంలో శుక్రవారం చోటేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో వసంత బుచ్చమ్మ అనే మహిళ చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నది. ఆమె ఈ నెల 13న ఇంటికి తాళం వేసి కనపడకుండా పోయినట్లు ఇరుగుపరుగు వారు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు తమ బంధువుల వద్ద వాకబు చేసినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాంతినగర్‌లో..



సరిత(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 16 : సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అగుల్ల సరిత(30) గురువారం మధ్యాహ్నం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం తన తండ్రి మిట్టపల్లి కుమారస్వామితో కలిసి ఓ బ్యాంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కనిపించకుండా పోయింది. ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి మిట్టపల్లి కుమారస్వామి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కూతురు సరిత మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నదని ఆయన పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యూటీ పార్లర్ పేరుతో
ఘరానా మోసం

- ఫ్రాంచైజీలంటూ రూ.3 కోట్లు వసూలు
- ఉమ్మడి జిల్లాలో 100 మంది బాధితులు
- నలుగురు నిర్వాహకులు అరెస్టు
- పరారీలో ముగ్గురు ప్రధాన నిందితులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 : బ్యూటీపార్లర్ పేరుతో ఆకర్షించారు. ఫ్రాంచైజీలంటూ అందినకాడికి దోచారు. మెదక్ ఉమ్మడి జిల్లాలోని బాధితుల నుంచి దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసి పరారైన కిలాడి దంపతుల ఘరానా మోసం ఆలస్యంగా వెలుగుచూసింది. హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో నివాసమున్న సమీనా, ఇస్మాయిల్ దంపతులు రోజ్ గోల్డ్ బ్యూటీపార్లర్ అకాడమీ పేరుతో యూట్యూబ్‌లో ప్రకటనలు అప్‌లోడ్ చేసి అమాయకుల దృష్టిని ఆకర్షించారు. ఒక్కో బ్యూటీ పార్లర్ ఫ్రాంచైజీ కోసం రూ.2.70 లక్షలు వసూలు చేశారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో వందల సంఖ్యలో బాధితులు ఉన్నట్లు సమాచారం. వారి నుంచి దాదాపు రూ.3 కోట్ల వసూలు చేశారు. ఫ్రాంచైజీ తీసుకుంటే బ్యూటీషన్ కోర్సు నేర్పించి ఏజెన్సీ నుంచి కొన్ని ప్రొడక్ట్ ఇచ్చి నెలకి రూ.35 వేల జీతం ఇస్తూ.. బిజినెస్ చేయిస్తామని నమ్మించారు. దాంతో సమీనా, ఇస్మాయిల్ మాయమాటలు నమ్మి అప్పు చేసి ఫ్రాంచైజీ తీసుకున్న బాధితులకు ఐదారు నెలల పాటు జీతం ఇచ్చారు. ఆ తర్వాత రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీశారు. జీతాల కోసం ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ పెట్టుకున్నారు. దాంతో అనుమానంతో మెదక్ జిల్లాకు చెందిన 10 మంది బాధితులు ప్రగతినగర్‌లోని హెడ్‌ఆఫీస్‌కు వెళ్లి చూడగా కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో మోసపోయామని గ్రహించి బావురుమన్నారు. హైదరాబాద్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని పోలీసులు సూచించారు. దాంతో గత నెల 30న మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసుల దర్యాప్తు ప్రారంభించారు. గురువారం మెదక్ సీఐ దిలీప్‌కుమార్ సంస్థ నిర్వాహకులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ప్రేమకుమారి, దేవిక, రవి, విశ్వతేజ ఉన్నారు. ప్రధాన నిందితులైన సమీనా, ఇస్మాయిల్, జానీపాషా పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు. త్వరలోనే వారి పట్టుకుంటామని తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 16 : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో గంజాయి పట్టుబడింది. కొంతకాలంగా గంజాయికి అలవాటుపడి జల్సాల కోసం విక్రయిస్తున్న ముగ్గురు యువకులు పోలీసుల చేతికి చిక్కారు. శుక్రవారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీను వివరాలు వెల్లడించారు. మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన సల్లారి సిద్ధిరాములు, చేర్యాల పట్టణానికి చెందిన నాగిని రాజు, అంజనాపురం రాకేశ్ ముగ్గురు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, కొంతకాలం క్రితం గంజాయికి అలవాటుపడ్డారు. జల్సాల కోసం హైదరాబాదులో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా అధిక ధరకు విక్రయించడం మొదలు పెట్టారు. శుక్రవారం ముస్త్యాల గ్రామ శివారులోని వైకుంఠధామం ఆవరణలో ఇతరులకు విక్రయించేందుక యత్నించారు. నమ్మదగిన సమాచారం మేరకు మద్దూరు ఎస్ఐ షేక్ యూనుస్ అలీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 74 గ్రాముల గంజాయిలభ్యమవడంతో పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురి సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

ఇంటి ఎదుట నిలిపిన ఉన్న కారులో నుంచి
రూ.ఐదు లక్షలు చోరీ



దొంగలు పగులగొట్టిన కారు అద్దాలు

చేగుంట, ఫిబ్రవరి 16 : పట్టపగలే కారు అద్దాలు పగులగొట్టి రూ.ఐదు లక్షలు చోరీ చేసిన సంఘటన చేగుంట మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. ఎస్ఐ బాల్‌రాజు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి హైదరాబాదులో నివాసం ఉంటూ బిల్డర్‌గా పనిచేస్తున్నారు. చేగుంట మండల కేంద్రంలోని సీతారంనగర్ కాలనీలో ఉంటున్న తన మిత్రుడి ఇంటికి సంబంధించిన రూ.ఐదు లక్షలను స్థానికంగా యూనియన్ బ్యాంక్ నుండి డ్రా చేసి కారులో తీసుకువచ్చారు. మిత్రుడి ఇంటి ఎదుట కారును పార్కుచేసి టీ తాగి రావడానికి లోనికి వెళ్లాడు. నలుగురు గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.ఐదు లక్షలను దొంగిలించి పారిపోయారు. కారు అద్దాలు పగిలిన చప్పుడు రావడంతో వెంటనే ఇంటి నుంచి బయటకు వచ్చి దొంగలను వెంబడించినప్పటికీ వారు దొరకలేదు. బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజిని పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ ఆర్.బాల్‌రాజు వెల్లడించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, ఫిబ్రవరి 16 : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామ పరిధి లింబ్యానాయక్ తండాలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. లింబ్యానాయక్ తండాకు చెందిన భుక్య గణేష్ (37) కూలీ పనులు చేస్తుంటాడు. తండాలో కొత్తగా రేకుల ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పు చేశాడు. మద్యానికి బానిసగా మారాడు. గురువారం రాత్రి నూతనంగా నిర్మిస్తున్న కొత్త ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు
కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ

చేర్యాల, ఫిబ్రవరి 16 : ఇటీవల కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పలువురు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. శనివారం నుంచి నల్లగొండ జిల్లా మందారెడ్డిగూడెంలో నిర్వహించనున్న 33వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు సంసిద్ధం చేసేందుకు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ చేపట్టారు. ఈమేరకు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి తదితరులు క్రీడాకారులను అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు భూంపల్లి విద్యార్థిని ఎంపిక

మిరుదొడ్డి, ఫిబ్రవరి 16 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి బోయిని వెన్నెల ఎంపికైందని శుక్రవారం పీఈటీ వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా మల్లారెడ్డిగూడంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. వెన్నెలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఉషోదయ వేళ.. సూర్య నమస్కారాలు

- రథసప్తమి సందర్భంగా కోమటిచెరువు వద్ద యోగా కార్యక్రమం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 16 : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు వద్ద వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సూరనమస్కార ఆసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలు, పెద్దలు పాల్గొని ఉషోదయ వేళ సూర్య నమస్కారాలు చేశారు. ప్రముఖ యోగ గురువు తోట సతీష్, సంధ్య సూర్య శ్లోకాలతో లయబద్ధంగా సూర్య నమస్కారాలను చేయించారు. రథసప్తమి సందర్భంగా 21 రోజులు సూర్య నమస్కారాలు ఛాలెంజ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న యోగా సాధకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రథసప్తమి వేడుకలను ఆన్‌లైన్ ద్వారా అమెరికా, ఐర్లాండ్‌లో కూడా నిర్వహించినట్లు యోగాగురువు తోట సతీష్ చెప్పారు. భారత్ స్వాభిమాన్ పతంజలి సమితి జిల్లా అధ్యక్షుడు రంగాచారి, సంఘం ప్రతినిధులు అంజయ్య, ప్రోగ్రాం కన్వీనర్ రాజమల్లయ్య, కో కన్వీనర్ లింగమూర్తి, యుటీఎంఎ రాష్ట్ర అధ్యక్షురాలు విజయ, ట్రేస్మా రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ వడ్లకొండ సాయి, పూర్ణిమ ఎల్లంయాదవ్, యోగా శిక్షకులు శివ శ్రీనివాస్, చిప్ప ప్రభాకర్, గూడెం రఘువర్ధన్‌రెడ్డి, సింగోజి జనార్ధన్, శ్రీనాథ్‌రెడ్డి, వంగ నర్సిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.



పేరు మార్చినా పైసలిస్తలే!

- కేసీఆర్ కిట్ పథకం
  మాతా శిశు ఆరోగ్య కిట్‌గా పేరు మార్పు
- అయినా విడుదల కాని నిధులు
- ఏడాదిన్నరగా ఎదురుచూపులు
- మెదక్ జిల్లాకు రూ.21.28 కోట్లు పెండింగ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు గత ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పేరిట పథకాన్ని ప్రారంభించింది. నవజాత శిశువుకు అవసరమైన సామగ్రితో పాటు నగదు ప్రోత్సాహం అందించేది. అయితే మూడేళ్లుగా కిట్ తోనే సరిపెడుతున్నారు. బాలింతల ఖాతాల్లో నగదును మాత్రం జమ చేయడం లేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ ఆ పథకాన్ని మాతా శిశు ఆరోగ్య(ఎంసీహెచ్) కిట్‌గా పేరు మార్చింది. కిట్‌ను అందజేస్తున్నా డబ్బు గురించి మాత్రం ప్రస్తుత ప్రభుత్వం ఊసెత్తడం లేదు.

నాలుగు విడతలుగా జమ

సర్కారు దవాఖానాల్లో ప్రసవం అయిన తల్లులకు అప్పటి ప్రభుత్వం నాలుగు విడతలుగా ఆడబిడ్డ పుడితే



బాలింతలకు అందజేసే ఎంసీహెచ్ కిట్

రూ.13 వేలు, మగబిడ్డ జన్మిస్తే రూ.12 వేల నగదు బాలింతల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దాంతో పాటు నవజాత శిశువుకు అవసరమైన సబ్బు, రెండు జతల దుస్తులు, చిన్న పరుపు, నూనె, దోమతెర, రెండు టవళ్లు, తల్లికి రెండు చీరలతో కూడిన కిట్‌ను అందిస్తున్నారు. నగదును మాత్రం నాలుగుసార్లుగా ఖాతాల్లో జమ చేసేవారు. మొదటి దఫా ప్రభుత్వ ఆసుపత్రిలో చెకప్ చేయించుకున్న తర్వాత, రెండో దఫా కాన్పు అయ్యాక, మూడో దఫా మూడు నెలల చిన్నారికి టీకాలు పూర్తయ్యాక, నాల్గోవ దఫా చిన్నారికి అన్ని రకాల టీకాలు పూర్తిస్థాయిలో వేయించిన తర్వాత నగదును ఖాతాల్లో జమ చేశారు.

మెదక్ జిల్లాలో 73,324 మందికి పెండింగ్

18 నెలలుగా కిట్‌లకు సంబంధించిన ప్రోత్సాహక డబ్బు విడుదల కాకపోవడంతో మెదక్ జిల్లాకు రూ.21.28 కోట్లు పెండింగ్ ఉన్నాయి. ప్రసవాలు చేయించుకున్న బాలింతల నగదు గురించి ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను నిత్యం అడుగుతూనే ఉన్న వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. ఈ పథకం ప్రారంభమైన నుంచి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,06,143 మందికి రూ.31.56 కోట్లు చెల్లించారు. ఇంకా 73,324 మందికి రూ.21.28 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

మూడేళ్లవుతున్నా జమ కాలేదు



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగింది. ఆడబిడ్డ పుట్టింది. కిట్ బ్యాగు మాత్రమే అందించారు. 36 నెలలు గడుస్తున్నా డబ్బు ఖాతాల్లో జమ కాలేదు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు.

- నాగలక్ష్మి, మెదక్

విడుదల కాగానే జమ చేస్తాం



గర్భిణులు, బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. సర్కారు దవాఖానాల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను ప్రభుత్వానికి నివేదికను అందజేస్తున్నాం. నిధులు విడుదల కాగానే డెలివరీ అయిన వారి ఖాతాల్లో జమచేస్తాం.

- చందునాయక్, డీఎంహెచ్‌వో, మెదక్

సిద్దిపేట జిల్లాలో రూ.28.84 కోట్ల బకాయిలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 16 : సిద్దిపేట జిల్లాలో మూడేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకున్న బాలింతలకు డబ్బు అందించలేదు. జిల్లాలో 2021 సంవత్సరంలో 35,047 మందిని అర్హులుగా గుర్తించి వారిలో 8,469 మందికి రూ.2.60 కోట్లు చెల్లించారు. 26,465 మందికి రూ.7.93 కోట్లు ఇవ్వాలి. 2022 సంవత్సరంలో 36,821 మందిని అర్హులుగా గుర్తించి ఇద్దరికి మాత్రమే ఇచ్చి, మిగతా 36,819 మందికి రూ.11.04 బకాయి పడింది. 2023లో 30,120 మందికి ముగ్గురికి చెల్లించి మిగతా వారికి రూ.9.03 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13వ వరకు 2,738 మందికి రూ.82 లక్షలు ప్రభుత్వం బకాయి పడింది. జిల్లా మొత్తం రూ.28.84 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడిపించాలి

- మెదక్ అదనపు కలెక్టర్ రమేష్ కుమార్
- రాధాస్మెల్టర్ పరిశ్రమలో ప్లాంట్ విస్తరణపై అభిప్రాయ సేకరణ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడిపించాలని మెదక్ అదనపు కలెక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. చిన్నశంకరంపేట గ్రామ శివారులోని రాధాస్మెల్టర్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి నాలుగో ప్లాంటు విస్తరణకు పర్యావరణ అనుమతుల కోసం శుక్రవారం పరిశ్రమ ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అదనపు కలెక్టర్ రమేష్‌కుమార్ అధ్యక్షత వహించగా రెండు సేషన్లగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా వంద మందికిపైగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ విస్తరణ పనులకు ఆమోదం తెలిపారు. మరికొంత మంది తమ అభిప్రాయాలను అర్జీల రూపంలో అందించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ స్థానికులకు పరిశ్రమలో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడించిన విషయాలను పర్యావరణ శాఖకు పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాధాస్మెల్టర్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌షరప్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి మెదక్ జిల్లా అధికారి కుమార్ పాల్, తహసీల్దార్ మన్నన్, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, ఎడ్ల కిష్టయ్య, మాజీ ఎంపీపీ కర్రె కృపావతి, అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణ చేస్తున్న అదనపు కలెక్టర్ రమేష్‌కుమార్

మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తాం

- మెదక్ కలెక్టర్ రాజర్షిషా హెచ్చరిక

మెదక్, ఫిబ్రవరి 16 : మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తామని మెదక్ కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల29 తో ముగుస్తున్నందున ఆలోగా సీఎంఆర్ బియ్యం ఇవ్వని పక్షంలో మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టు ప్రయోగిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిల్లుల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రైస్ మిల్లులలో సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్ మిల్లింగ్ జరుపుతూ గడువులోగా ఎఫ్‌సీఐకి చేరవేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, బ్రహ్మారావు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్‌జోన్‌లో కలపాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 16 : మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో జీరో అవర్‌లో తనకు మాట్లాడే అవకాశం రాగా ప్రస్తుతం రాజన్న జోన్‌లో మెదక్ జిల్లా ఉండడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, నిరుద్యోగులు నష్టపోయే అవకాశముందని ప్రస్తావించానన్నారు. ముఖ్యంగా నర్సాపూర్ నియోజకవర్గం హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉండటమే కాకుండా ఏ పనికైనా ఇక్కడి వారంతా హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారని, రాజన్న జోన్‌లోని ప్రాంతాలతో సంబంధం ఉండదని, దూరభారం అవుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చార్మినార్ జోన్‌లో కలిపి ఇక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరినట్లు సునీతారెడ్డి తెలిపారు.

అదనపు ఎస్పీ.. ఆన్ డ్యూటీ

- బాధ్యతలు స్వీకరించిన సంజీవ్‌రావు



సంజీవ్‌రావు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 16: సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా ఆరేటి సంజీవ్‌రావు శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన పి.అశోక్ రాచకొండ అడిషనల్ డీసీపీగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

కన్నులపండుగగా శివపార్వతుల కళ్యాణం

హత్నూర, ఫిబ్రవరి 16: హత్నూర మండలం దౌల్తాబాద్ భవాని స్పటిక లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎదురుకోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున శివ స్వాములతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పాచిబండ్ల ఊరేగింపు, పల్లకీ సేవ నిర్వహించారు.



ఉత్సవమూర్తులు

పది నెలలుగా నో స్టైఫండ్

- ఇబ్బందుల్లో 21 మంది డీఎన్‌బీ విద్యార్థులు
- టీవీవీపీ కమిషనర్‌కు వినతి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్లొమేట్ నేషనల్ బోర్డు(డీఎన్‌బీ) కింద పీజీ వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పది నెలలుగా స్టైఫండ్ రావడం లేదు. దీంతో వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంబీబీఎస్ తర్వాత మూడేళ్ల పాటు డీఎన్‌బీ కోర్సు కింద పీజీ వైద్య విద్యను అభ్యసిస్తుంటారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో 21 మంది డీఎన్‌బీ విద్యార్థులున్నారు. ఇందులో పీడియాట్రిక్స్ విభాగంలో ఆరుగురు, జనరల్ సర్జరీలో ఆరుగురు, అనస్తేషియా విభాగంలో నలుగురు, గైనకాలజీలో ఐదుగురు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.60 వేలు స్టైఫండ్ చెల్లిస్తుంది. అయితే, 10 నెలలుగా స్టైఫండ్ రాకపోవడంతో వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ వారు శుక్రవారం టీవీవీపీ కమిషనర్ డా.అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో స్టైఫండ్ విడుదల చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని డీఎన్‌బీ పీజీ వైద్య విద్యార్థులు తెలిపారు.

చేతివృత్తుల అభివృద్ధికి పీఎం విశ్వకర్మ పథకం

- కామన్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తులు

రేగోడు ఫిబ్రవరి 16: చేతివృత్తులను ప్రోత్సహిస్తూ, వారు తయారు చేసిన ఉత్పత్తులను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుంది. స్వయం ఉపాధిగా తమ వృత్తుల్లో చేతి పనిముట్లను ఉపయోగిస్తూ జీవించే వడ్రంగి, కమ్మరి, కంసాలి, కుమ్మరి, అవుసలి, చాకలి, మంగలి, కుట్టు మిషన్, బుట్టలు అల్లేవారు, చేపలు పట్టేవారు, తాళాలు మరమ్మతులు చేసేవారు, మోచీలు ఇలా 18 రకాల చేతివృత్తులు వారికి ఈ పథకం వర్తిస్తుంది. మొదటి విడతగా రూ.లక్ష, రెండో, మూడో విడతలో రూ.3 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారు. ఎంపికైన వారికి రూ.15వేల విలువచేసే టూల్ కిట్‌తో పాటు గుర్తింపు కార్డును ఇస్తారు. ఈ పథకం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో రోజుకు రూ. 500 భృతి చెల్లిస్తారు. అనంతరం రుణాలు మంజూరు చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి : సీఎస్సీ మెదక్ జిల్లా మేనేజర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకానికి చేతివృత్తిదారులు దరఖాస్తు చేసుకోవాలని సీఎస్సీ మెదక్ జిల్లా మేనేజర్ రాజు కోరారు. కామన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పంచాయతీ, మండల, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎంపిక చేస్తామని తెలిపారు.

సమయపాలన పాటించని
ఉపాధ్యాయుడికి మెమో జారీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 16 : మండల పరిధిలోని నేల్లూరు ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డికి శుక్రవారం ఎంఈవో యాదగిరి మెమో జారీ చేశారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా అందులో ఒక ఉపాధ్యాయురాలు రజిత సెలవులో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి పాఠశాలకు ఉదయం 10.30 గంటల వరకు రాలేదు. ఉపాధ్యాయుడు రాని విషయం గమనించిన తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంఈవో యాదగిరికి సమాచారం అందించారు. స్పందించిన ఎంఈవో పాఠశాలను సందర్శించారు. ఉదయం 11.30 గంటలకు ఉపాధ్యాయడు వెంకట్‌రెడ్డి పాఠశాల వచ్చారు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన వెంకట్‌రెడ్డికి ఆయన మెమో జారీ చేశారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిస్తానని ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని, వేరే టీచర్‌ను నియమించాలని ఎంఈవోను గ్రామస్థులు కోరారు.

ఆటో డ్రైవర్ల పొట్టకొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డులో సీఎం దిష్టిబొమ్మ దహనం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను పొట్టకొడుతుందని తమ సమస్యలకు పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు మెదక్ చేగుంట రహదారిపై ఆటో యూనియన్ డ్రైవర్లు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ చాలా మంది నిరుపేదలు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలకు గిరాకీలు లేక, ఫైనాన్సులు కట్టలేని దుస్థితి నెలకొందన్నారు. కుటుంబం గడవక మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొంతమంది గుండెపోటుతో మృతి చెందుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆటో డ్రైవర్లు

సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయింపు

హత్నూర, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని దౌల్తాబాద్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కోనంపేట శేఖర్, ఆటో యూనియన్ నాయకులు సంతోష్, శంకర్, గఫూర్, బాలరాజ్, వీరేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో ఆందోళన

జిన్నారం, ఫిబ్రవరి 16: రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని బొల్లారంలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలోని గాంధీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌లు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఢిల్లీ, ముంబయి తరహాలో ఎలక్ట్రిక్ ఆటోలను అందజేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల ఆందోళనకు బీఆర్ఎస్, కార్మిక నాయకులు ఆనంద కృష్ణారెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్‌రెడ్డి మద్దతు తెలిపారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

దేశవ్యాప్త సమ్మె విజయవంతం



రేగోడు గాంధీ చౌక్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

కేంద్రం అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విజయవంతమైంది. పలు కార్మిక సంఘాలు, రైతుసంఘాలు, కాంగ్రెస్, టీజేఎస్, సీపీఎం, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్ యూనియన్ల నాయకులు, కార్మికులు పట్టణాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల ప్రధాని మోదీ, ఎన్‌డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మత విభజన పేరుతో ప్రజల ముందుకు వస్తున్న బీజేపీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం తప్పక చెబుతారన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ వంతపాడుతూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా కార్మికులకు నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 16: సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా సీఐటీయూ నాయకులు, కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్‌ప్రసాద్, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి యజరాజ్, యాదవరెడ్డి, యాదగిరి, మాజీ ఎంపీపీ అంజనేయులు, ఇస్మాయిల్‌ఖాన్‌పేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ బక్క బలరాం, ఎంకని ప్రవీణ్, కూన సంతోష్‌కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావీద్‌అలీ, కార్యదర్శి రవి, కసిని శ్రీకాంత్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, నిర్మల, రాజ్‌కుమార్, సువర్ణ, సుధామణి పాల్గొన్నారు.

● **మెదక్ అర్బన్:** సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ నుంచి హెడ్‌పోస్టాఫీస్ వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బసవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధానరహదారి మీదుగా సుభాస్‌గంజ్‌కు వరకు ర్యాలీ తీశారు. అక్కడ బహిరంగ సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో సమ్మె విజయవంతమైంది. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.మల్లిఖార్జున్, హెచ్‌ఎంఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్‌రెడ్డి, నాయకులు రతన్‌సింగ్, అమర్‌యాదవ్, స్వామాట్ రాజశేఖర్‌రెడ్డి, సాంబయ్య, కిషన్, పాష, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు వాజిద్‌అలీ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రధాన చౌరస్తా వద్ద కార్మికులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగరాజు, నాయకులు అన్నపూర్ణ, రమేష్, అశోక్, రాములు, నర్సింలు, శకుర్, రాంచందర్, పుష్ప, వరలక్ష్మి, నాగరణి పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌లోని అంబేద్కర్ చౌక్‌లో సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్, వివిధ సంఘాల నాయకులు అలిగే జీవన్‌కుమార్, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తహసీల్ మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం, పంచాయతీలు, మున్సిపల్ కార్మికులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యవారి విష్ణు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హమాలీ, పెయింటర్, మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సిలువేరి వీరేశం, టీఎస్ యూఈఈయూ ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, అడ్వయిజర్ స్వామి, హన్మంతు ఆధ్వర్యంలో కార్మిక సంఘ నాయకులు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

● **శివ్వంపేట:** సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని శభాష్‌పల్లి నుంచి శివ్వంపేట వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి, సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సువర్ణ, యాదగిరి, శేఖర్, కుమార్, ఇంద్రేష్, శివశంకర్, రేణుక, గోప్పమ్మ, గౌస్, మిషన్ తదితరులు పాల్గొన్నారు.

● **రేగోడు:** రైతు సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎండి సర్దార్ ఆధ్వర్యంలో రేగోడులో రైతులు, కార్మికులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు రామాగౌడ్, శివరాజ్, సాయిలు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మంజుల, పద్మ, భూమమ్మ, కళావతి, ఆశా వర్కర్లు ప్రభావతి, మంజుల, మిషన్ భగీరథ యూనియన్ రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **మనోహరాబాద్:** సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కాళ్లకల్ పారిశ్రామిక ప్రాంతంలో పలు పరిశ్రమలను మూసివేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆసీఫ్, వీరేష్, స్వామి, బాలేష్, తిరుపతి, ఉపేందర్, స్వరూప, గురుమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు ఖాజాపూర్, కామారం, అంబాజీపేట, చందంపేట గ్రామ శివార్లలో ఉన్న పరిశ్రలను మూసివేసి, కార్మికులతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

● **వెల్దుర్తి:** రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరి ఆధ్వర్యంలో వెల్దుర్తిలో దుకాణాలతో పాటు వర్తక వాణిజ్య సంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో నరేందర్, వెంకట్, బాబు, సాయిలు, అశోక్, యాదగిరి, విఠల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

● **పుల్‌కల్:** సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాయిలు ఆధ్వర్యంలో పుల్కల్, చౌటకూర్ మండలాల్లో రైతులు, కూలీలు, కార్మికులు, కర్షకులతో కలిసి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు ఆయా మండలాల్లోని శివంపేట, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, బస్వాపూర్, పోచారం గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్, సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల నాగభూషణం, నాయకులు బి.రాజు, సత్యనారాయణ, శ్రీశైలం, మహేశ్, కృష్ణ, నర్సింలు, యాదగిరి, కాంగ్రెస్ నాయకుడు బోడపట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** బొల్లారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్‌కేవీ సంఘాల నాయకులు వరప్రసాద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆనందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

● **హవేళిఘణపూర్:** హవేళిఘణపూర్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, దుర్గ, యశోద, సావిత్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.



జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పటాన్‌చెరు పట్టణంలో ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్ష, కార్మిక సంఘాల నాయకులు



నర్సాపూర్‌లో జాతీయ రహదారిపై మానవహారం చేపట్టి నిరసన తెలుపుతున్న కార్మికులు



తూప్రాన్ పట్టణంలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు



నారాయణఖేడ్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



వెల్దుర్తి దుకాణాలను బంద్ చేయిస్తున్న దృశ్యం



వెంకటకిష్టాపూర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి అనంతకిషన్

మార్షల్ ఆర్ట్స్ ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది

● **సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 16 : విద్య జ్ఞానాన్ని పంచితే.. మార్షల్ ఆర్ట్స్ ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం నిర్వహించిన కరాటే పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలబాలికలకు తల్లిదండ్రులు విద్యతో పాటు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించాలన్నారు. అనంతరం విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, పాఠశాల ప్రధానాచార్యుడు నర్సింహ్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్,ఫిబ్రవరి 16: నారాయణఖేడ్ పట్టణ శివారులోని అనురాధ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. కార్యక్రమంలో నగర ఏబీవీపీ అధ్యక్షుడు నాగ్‌నాథ్‌రావు, జిల్లా కన్వీనర్ ఆకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, నాయకులు శివ, నికిల్, వెంకట్, చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం

● **సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నాగేశ్వర్‌రావు**

పాపన్నపేట, ఫిబ్రవరి 16: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నార్సింగిలోని విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడు, అల్లాదుర్గం, మండలాల నుంచి వచ్చిన వినియోగదారులు తమ సమస్యలను విన్నవించారు. సమస్యలు స్థానికంగా పరిష్కారం కాని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యుడు ఎస్‌కేకే వెంకట, డీఈ కృష్ణారావు, ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నర్సింలు, సబ్ ఇంజనీర్ సాయికుమార్, జూనియర్ లైన్‌మెన్ సమీర్ తదితరులు ఉన్నారు.

రేపు గిరిజన గురుకులాల ప్రవేశ పరీక్ష

నర్సాపూర్, ఫిబ్రవరి 16: ఈ నెల 18న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్‌లోని గిరిజన గురుకులంలో 343 మంది, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లిలో గురుకుల డిగ్రీ కళాశాలలో 330 మంది, నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి గిరిజన గురుకులంలో 258 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధికి రూ.20 లక్షల నిధులు

పుల్‌కల్, ఫిబ్రవరి 16: చౌటకూర్ మండలంలోని చక్రియాల గ్రామ పంచాయతీ అభివృద్ధికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్రసాంకేతిక విద్యాశాఖ మంత్రి దామోదర రాజనరసింహ నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరథ్ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, వెండికోలు రాములు, భానూరి లక్ష్మణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్నె నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా ఉమ

సదాశివపేట, ఫిబ్రవరి 16 : సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా ఉమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఎంసీ విభాగంలో ఆమె సేవలందించారు. బదిలీపై సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.శ్రీనివాస్‌రెడ్డి జహీరాబాద్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

సంగారెడ్డి తహసీల్దార్‌గా దేవిదాస్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 16: సంగారెడ్డి తహసీల్దార్‌గా దేవిదాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఫర్‌హీన్ షేక్ హత్నూర మండలానికి బదిలీ ఆయ్యారు. ఆమె స్థానంలో నారాయణఖేడ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దేవిదాస్ సంగారెడ్డికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్ఐ ప్రమోద్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జిన్నారం తహసీల్దార్‌గా భిక్షపతి

జిన్నారం, ఫిబ్రవరి 16: జిన్నారం తహసీల్దార్‌గా ఎం.భిక్షపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ రవికుమార్ స్థానంలో భిక్షపతి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా ఎంపీడీవోగా రేణుక బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్, ఎంపీడీవోను ఎంపీపీ రవీందర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు సన్మానించారు.

కోహీర్ తహసీల్దార్‌గా బాలశంకర్

కోహీర్, ఫిబ్రవరి 16: కోహీర్ తహసీల్దార్‌గా బాలశంకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కోహీర్ తహసీల్దారుగా పనిచేసిన శాంతకుమారి బదిలీపై డీఏవోగా సంగారెడ్డికి వెళ్లారు. కల్హేర్ మండల తహసీల్దార్‌గా పనిచేసిన బాలశంకర్ కోహీర్ మండలానికి బదిలీపై వచ్చారు. కోహీర్ తహసీల్దార్‌గా పనిచేసిన శాంతకుమారి శుక్రవారం రిలీవ్ అవ్వగా, నూతన తహసీల్దారుగా బాలశంకర్ బాధ్యతలు స్వీకరించారు.

చిన్నశంకరంపేట ఏపీవోగా నారాయణ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16: చిన్నశంకరంపేట నూతన ఏపీవోగా నారాయణ శుక్రవారం బాధ్యలను స్వీకరించారు. చిన్నశంకరంపేటలో విధులు నిర్వహించిన ఏపీవో వెంకటసాయిగౌడ్ తూప్రాన్‌కు బదిలపై వెళ్లారు. నారాయణ హవేలిఘనపూర్ నుంచి ఇక్కడి వచ్చారు.

రామాయంపేట ఎక్సైజ్ సీఐగా రాణి

రామాయంపేట, ఫిబ్రవరి 16 : రామాయంపేట ఎక్సైజ్ నూతన సీఐగా ఎస్.రాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జయప్రద హైదరాబాద్ ఐడీఏ బొల్లారాం బదిలీకాగా.. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు సాలూర చెక్‌పోస్టు వద్ద విధుల నిర్వహిస్తున్న రాణి రామాయంపేటకు వచ్చారు. కొత్తగా వచ్చిన ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ.. గంజాయి రవాణా జరగకుండా అడ్డుకట్ట వేస్తామన్నారు. కల్తీకల్లు విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రంథాలయ స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు తప్పవు

● **జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ**

వెల్దుర్తి, ఫిబ్రవరి 16: రెండు సంవత్సరాల క్రితం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న 566 గజాల స్థలాన్ని గ్రామ పంచాయతీ వారు గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించి, జిల్లా గ్రంథాలయ సంస్థ పేరున రిజిస్ట్రేషన్ చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ సంస్థకు కేటాయించిన స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ సహాయకులు నరేందర్‌రెడ్డి, జూనియర్ సహాయకులు శంకర్, వెల్దుర్తి ఈవో బలరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్టు

మెదక్, ఫిబ్రవరి 16: మూడు రోజుల క్రితం జరిగిన కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన నరేష్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతడికి పాల్ అనే యువకుడితో తగాదాలున్నాయి. ఈ క్రమంలో పాల్ అతడి స్నేహితులు మర్కంటి స్వామి, ప్రశాంత్‌తో కలిసి నరేష్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి

జిన్నారం, ఫిబ్రవరి 16: బొల్లారం మున్సిపాలిటీ అభివృద్ధికి పరిశ్రమలు సహకారం అందించాలని చైర్‌పర్సన్ రోజారాణి కోరారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీకి స్థానిక అమెజోన్ కెమికల్స్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల కింద చెత్త సేకరణ కోసం ట్రాక్టర్‌ను అందించగా.. చైర్‌పర్సన్ రోజారాణి ప్రారంభించారు. ఇతర పరిశ్రమలు కూడా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు, ఉపాధ్యక్షుడు రాయుడు, అమెజోన్ పరిశ్రమ ప్రతినిధులు శివరావు, చంద్రశేఖర్, మనోహర్, మున్సిపల్ కౌన్సిలర్ సంతోషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో బోరు

కొండాపూర్: తొగర్‌పల్లిలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు ప్రశాంత్‌గౌడ్ రూ.3లక్షలతో బోరు వేయించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ శుక్రవారం బోరుమోటారును ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు వెళ్లిన రైతులు

నారాయణఖేడ్: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన అగ్రిటెక్ ఎక్జిబిషన్‌కు వ్యవసాయ శాఖ ఆత్మ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ డివిజన్‌లోని వివిధ గ్రామాల రైతులు తరలివెళ్లారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

హత్నూర, ఫిబ్రవరి 16: హత్నూర మండలం శేర్ఖాఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుకుమీది నల్ల పోచమ్మ ఆలయ(పాలక మండలి ఏర్పాటు కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆలయ ఈవో శశిధర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తల ఎన్నిక కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనరేట్‌లో నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 20రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలకు డిమాండ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 16: మండలంలోని కూచారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు అమారావాణిపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం సవిత, ఇతర ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అమరావాణి విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులతో కొన్ని రోజులు దురుసుగా ప్రవర్తిస్తున్నదని ఆరోపించారు. తరగతి గదిలో ఫోన్‌లో ఇతరులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నదన్నారు. ఇతరుల ఉపాధ్యాయులతో ఎలాంటి కారణం లేకుండా గొడవకు దిగుతున్నదని ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చేగుంట, ఫిబ్రవరి 16: రథసప్తమిని పురస్కరించుకుని జీవన మంత్ర యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు యోగాపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అల్లి నరేష్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం గురించి వివరించారు. కార్యక్రమంలో జీవన మంత్ర యోగా ఫౌండేషన్ సభ్యులు గర్దాస్ మనోహర్, గందే ప్రశాంత్, పెంటాగౌడ్, సంతోష్, సుభాష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, పాఠశాల ఎస్‌వో శ్రీవాణి, ఫిజికల్ డైరెక్టర్ గిరిజ, అనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరా బంద్

పాపన్నపేట, ఫిబ్రవరి 16: మిన్పూర్ ఉప విద్యుత్ కేంద్రంలో పొడ్చన్‌పల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నర్సింలు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నాగ్‌సాన్‌పల్లి, కొత్తపల్లి, గాంధారిపల్లి, పొడ్చన్‌పల్లి, ఉప కేంద్రాలకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రూ.40.88కోట్ల అంచనాలతో నర్సాపూర్ బడ్జెట్

● **మున్సిపల్ సమావేశంలో ఆమోదం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 16: నర్సాపూర్ మున్సిపల్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.40.88కోట్ల అంచనా ఆదాయంతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డి.అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. ఆదాయ, వ్యయాలను అధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వ్యయం అంచనా రూ.40.52కోట్లుగా నిర్ణయించారు. అంచనా వేసిన మున్సిపల్ సాధారణ ఆదాయం రూ.6.97కోట్లు కాగా వ్యయం రూ.6.61కోట్లు. గ్రాంట్ల రూపంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.33.82కోట్లు కాగా, వ్యయం రూ.33.82కోట్లు అని అధికారులు పాలకవర్గం దృష్టికి తెచ్చి బడ్జెట్‌ను ఆమోదించారు. గ్రీన్ బడ్జెట్‌కు సాధారణ నిధుల నుంచి పదిశాతంగా రూ.66.18లక్షలు కేటాయించారు. సమావేశంలో వైస్ చైర్మన్ నయీముద్దీన్, కమిషనర్లు వెంకట్‌గోపాల్, జైత్‌రాంనాయక్, కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేస్, యాదగిరి సునీతాబాల్‌రెడ్డి, లతారమేష్‌యాదవ్, ఇస్రత్‌సిద్దిఖీ, మేనేజర్ మధుసుదన్, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి

నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పాటుపడాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎవరైనా, ఎప్పుడైనా పార్టీలకతీతంగా సమస్యలు తన దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. కాగా వేసవి వస్తున్నందున పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. కోతులు, కుక్కల బెడద ఉన్నదని కౌన్సిలర్లు దృష్టికి తెచ్చినందున అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గిరిజన గురుకులం వరకు డివైడర్ నిర్మాణం కోసం జాతీయ రహదారి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వివరించారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 16: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా కోర్టులో శుక్రవారం జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించి, కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి హన్మంతరావు, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే

● **ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్, ధర్నా**

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు భోజన విరామ సమయంలో కలెక్టర్ ఎదుట ధర్నా దిగారు. పెన్షన్ భిక్షకాదు.. ఉద్యోగుల హక్కు అంటూ నినదిస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ భద్రత, కుటుంబ భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో పద్మశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, కార్యదర్శులు చిరంజీవులు, శివాజీ, రాధా, మెదక్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు రామాగౌడ్, శ్రీకాంత్, తులసీరాం, లవణ్, సత్యనారాయణ, సలీం, గంగకృష్ణ పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీఎన్జీవో నాయకులు

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు మినాయింపు ఇచ్చి పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాలల్లో ఉచిత విద్యుత్, ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.



రాయికోడ్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయికోడ్‌లో

రాయికోడ్: రాయికోడ్‌లో టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. నిరసనలో టీపీటీఎఫ్ రాయికోడ్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బి.బీరయ్య, ఉపాధ్యక్షురాలు బి.మంజుల, గోదావరి, శ్రీనివాసమ్మ, జిల్లా కౌన్సిలర్ జి.రవీందర్ టీపీటీఎఫ్ నాయకులు ఖైరతలి, నగేష్‌కుమార్, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.